RNI. No. TELTEL /2022/ 89348

మన వార్తలు.. మన సమాచారం.. మన విశేషాల మాగాణ.. మన..

# తెలంగాణ అవతరణ

ఆత్మ గౌరవ అక్షర సాక్ష్యం

తె లు గు  ది న  ప త్రి క

సంపుటి : 4 సంచిక : 90 | పెద్దపల్లి | ఎడిటర్ : పి. రామకృష్ణ | మంగళవారం, మార్చి, 24, 2026 | పేజీలు : 8 | వెల : రూ. 5/-




## రైతు భరోసారూ.15 వేలకు
# ఎప్పుడు పెంచుతారో చెప్పండి

**- గత బడ్జెట్‌లో ఇచ్చిన హామీలేమయ్యాయి- పూర్తి పూర్తిస్థాయిలో అమలుకాని ఆరు గ్యారెంటీలు- కాంగ్రెస్ ప్రభుత్వంపై సభలో హరీశ్ ప్రశ్నల వర్షం**



**హైదరాబాద్,మార్చి,23:**తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత బడ్జెట్‌లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించిన ఆయన, క్షేత్రస్థాయిలో గ్యారంటీల అమలు తీరుపై ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని హరీష్ రావు మండిపడ్డారు. "భట్టి విక్రమార్క మాటలకు అర్థాలే వేరులే అన్నట్టుగా రాష్ట్ర పరిస్థితి ఉంది" అంటూ ఎద్దేవా చేశారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు, వాస్తవాలకు పొంతన లేదని ఆరోపించారు. వేలాది మంది రైతులకు ఇప్పటికీ రుణమాఫీ వర్తించలేదని, రైతులు బ్యాంకు చుట్టూ తిరుగుతున్నారని గుర్తు చేశారు. గతంలో కరోనా వంటి కష్టకాలంలో కూడా తాము (బీఆర్ఎస్) రైతుబంధును నిరంతరాయంగా ఇచ్చామని హరీష్ రావు తెలిపారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం కేవలం ఎన్నికలు వచ్చినప్పుడే రైతు భరోసా ఇస్తోందని, ఒక్క పంటకు కూడా సరిగ్గా పెట్టుబడి సాయం అందడం లేదని విమర్శించారు. రైతు భరోసాను రూ. 15 వేలకు ఎప్పుడు పెంచుతారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పంటలకు ఇస్తామన్న బోనస్ హామీ కేవలం 'బోగస్'గా మిగిలిపోయిందని, అటు రైతు కూలీలను కూడా ప్రభుత్వం దగా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాల వల్ల అన్నదాతలు అయోమయంలో ఉన్నారని, ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రావాల్సిన ప్రయోజనాలను వెంటనే అందించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. '2026--27 ఆర్థిక సంవత్సరంలో రూ.46,941 కోట్లు ఎక్సైజ్ మీద ఆదాయం వస్తుందని చెప్పారు. గత సంవత్సరం కంటే దాదాపు 12 వేల కోట్లు ఎక్కువ ఆదాయం వస్తుందని అంటున్నారు. అంత ఆదాయం రావాలంటే 25వేల కోట్లు మద్యం అమ్మాలి. ఏకంగా 35% ఎక్కువ ఆదాయం వస్తుందని చెప్తున్నారంటే, గల్లీకొక బెల్టు షాపు పెడతారా?' అని మంత్రి జూపల్లి కృష్ణారావును ఎమ్మెల్యే హరీష్ రావు ప్రశ్నించారు.

## హైదరాబాద్‌ను సిగ్నల్
# 'ఫ్రీ' సిటీగా మారుస్తాం

**- రూ.24,000 కోట్లతో 74 కి.మీ మెట్రో విస్తరణ ప్రణాళిక- ఎయిర్‌పోర్ట్‌కు మెట్రో కనెక్టివిటీ కల్పించాలనే లక్ష్యం- నగర ట్రాఫిక్ నియంత్రణకు "ఆపరేషన్ రోప్" సహా పలు చర్యలు- ఎలివేటెడ్ కారిడార్లు, మల్టీ లెవెల్ పార్కింగ్, సిగ్నల్ తగ్గింపు:సీఎం రేవంత్ కీలక ప్రకటన**



**హైదరాబాద్,మార్చి,23:** హైదరాబాద్ నగర అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశంలో కీలక ప్రకటనలు చేశారు. హైదరాబాద్ నగరంలోని ట్రాఫిక్ సమస్యలు, కాలుష్యం, మూసీ నది పునరుద్ధరణ వంటి అంశాలపై సమగ్ర ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేసిందని తెలిపారు. శాసన మండలి వేదికగా మాట్లాడిన ఆయన, నగర అభివృద్ధిలో రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలని ఆయన కోరారు. హైదరాబాద్ మహానగరంతో పాటు ముంబై, చెన్నై, బెంగళూరు వంటి నగరాల్లో ట్రాఫిక్, వర్షాల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని సీఎం అన్నారు. హైదరాబాద్ ను చారిత్రాత్మక నగరంగా అభివర్ణిస్తూ.. మానవ తప్పిదాల వల్లే సమస్యలు పెరిగాయని అన్నారు. ఇక నగరంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం రోడ్లను మూడు వర్గాలుగా విభజించడం, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం, సిగ్నల్ వ్యవస్థ తగ్గింపు, మల్టీ లెవెల్ పార్కింగ్ సిస్టమ్ ఏర్పాటు, "ఆపరేషన్ రోప్" అమలు వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇకమారో వైపు హైదరాబాద్ మెట్రోను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రణాళిక రూపొందించింది. రూ.24 వేల కోట్లతో 74 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరణ, ఎయిర్ పోర్ట్ కు మెట్రో కనెక్టివిటీ కల్పించే లక్ష్యం వంటి కేంద్ర సూచనలతో మెట్రోను ముందుకు తీసుక బోతున్నట్లు ఆయన తెలిపారు. గతంలో జైపాల్ రెడ్డి, వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో మెట్రో ప్రాజెక్ట్ ప్రారంభమైందని సీఎం గుర్తుచేశారు. నిర్లక్ష్యం కారణంగా దేశంలో హైదరాబాద్ మెట్రో ర్యాంక్ 12 పడిపోయిందని అన్నారు. అలాగే నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు పరిశ్రమలను నగర బయటకు తరలిస్తున్నామని సీఎం తెలిపారు. సుమారు 9 వేల ఎకరాల భూమి అందుబాటులోకి తీసుక వచ్చి మల్టీ యూజ్ జోన్లుగా అభివృద్ధి చేయబోతున్నట్లు తెలిపారు. అలాగే అపార్టుమెంట్ల నిర్మాణంతో గృహావసరాలకు పరిష్కారం, మూసీ నది పునరుద్ధరణ వంటి విషయాలపై ఫోకస్ చేసినట్లు తెలిపారు. మూసి నది అభివృద్ధిపై సీఎం మాట్లాడుతూ.. గంగా, సబర్మతి నదుల తరహాలో మూసీని కూడా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతిపక్షాలకు ప్రాజెక్టును అడ్డుకోవద్దని, సలహాలు ఇవ్వాలి కానీ రాజకీయాలు చేయొద్దని సీఎం విజ్ఞప్తి చేశారు. అవసరమైతే కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు.

## ఏపీ, తెలంగాణ
# కోర్టులకు బాంబు బెదిరింపులు



మచిలీపట్నం, ములుగు,, మార్చి 23 : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని రెండు కీలకమైన కోర్టులకు సోమవారం)బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం సృష్టించింది. మచిలీపట్నం (బందర్), తెలంగాణలోని ములుగు జిల్లా కోర్టులను లక్ష్యంగా చేసుకుని అజ్ఞాత వ్యక్తులు పంపిన ఈమెయిల్స్ న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులను భయాందోళనకు గురిచేశాయి. ఒకే తరహాలో ఈమెయిల్స్ రావడం వెనుక ఏదైనా కుట్ర ఉందా అనే కోణంలో తెలంగాణ, ఏపీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నం జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు రావడం సంచలనం సృష్టించింది. జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తికి అజ్ఞాత వ్యక్తి నుంచి బాంబు ఉందనే మెయిల్ రావడంతో ఒక్కసారిగా అంతా అప్రమత్తమయ్యారు. ప్రాణహాని ఉంటుందనే భయంతో న్యాయమూర్తులందరూ తమ గదులను వదిలి బయటకు వచ్చారు. వీరంతా కోర్టు ఆవరణలోని ఆరుబయట కుర్చీల్లో కూర్చుని పరిస్థితిని గమనించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, క్లూస్ టీమ్ కోర్టు ప్రాంగణాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ప్రస్తుతం క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. తెలంగాణలోని ములుగు జిల్లా కోర్టుకు కూడా అదే తరహాలో బాంబు బెదిరింపులు వచ్చాయి. కోర్టులో బాంబు పెట్టినట్లు ఈమెయిల్ రావడంతో సిబ్బంది, లాయర్లు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. దీంతో కోర్టు కార్యకలాపాలు నిలిచిపోయాయి. ములుగు పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో కోర్టు హాల్స్, రికార్డు రూమ్‌లను అణువణువు తనిఖీ చేస్తున్నాయి.

## శోభాయాత్ర ప్రశాంతంగా
# సాగేలా ఏర్పాటు చేస్తున్నాం: సీపీ సజ్జనార్



**హైదరాబాద్,మార్చి,23:** హైదరాబాద్, మార్చి 23: శ్రీరామ నవమిని పురస్కరించుకుని ప్రతిఏటా హైదరాబాద్‌లో వైభవంగా శ్రీరాముని శోభాయాత్రను నిర్వహిస్తారు. ఈ సారి కూడా శోభయాత్రను నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభించారు. హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఉత్సవ కమిటీ నిర్వహకులతో సమావేశం అయ్యారు. నగరంలో శ్రీరాముని శోభయాత్రలో నిర్వాహకులు కొన్ని నియమాలను తప్పకుండా పాటించాలని చెప్పారు. సీపీ సజ్జనార్ మాట్లాడుతూ.. 'శ్రీరామ నవమి ఉత్సవ కమిటితో సమన్వయ సమావేశం నిర్వహించాం. 16 ఏళ్లుగా శోభయాత్ర సమర్థవంతగా, విజయవంతంగా జరుగుతుంది. ఈ సారి కూడా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తాం. అందరి సహకారంతో ఈ యాత్రను ప్రశాంతంగా సాగేల ఏర్పాట్లు చేస్తున్నాం. శోభాయాత్ర కమిటీ కొన్ని విషయాలను మా ముందు ఉంచారు.. వాటిని పరిశీలిస్తాం' అని ఆయన వెల్లడించారు. 'అలానే ప్రభుత్వ, పోలీస్ శాఖ తరపు నుంచి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తాం. శోభాయాత్రకు సుమారుగా 3000 మంది పోలీసులు భద్రత విధుల్లో ఉంటారు. చైన్ స్నాచింగ్, ఇతర ఘటనలు జరగకుండా క్రైమ్ టీమ్స్ ను, షీ టీం(రాష్ట్రవ ంఘుఎం)లను మోహరిస్తాం. శోభాయాత్ర జరిగే తీరును డ్రోన్లతో పర్యవేక్షిస్తాము . ఈ యాత్ర సాగే మార్గాలు సీసీ టీవీలను ఏర్పాటు చేసి వాటి ద్వారా నిరంతర నిఘాని కొనసాగిస్తాం. గతేడాది వెహికల్ బ్రేక్‌డౌన్ కారణంగా శోభాయాత్ర నెమ్మదించింది. ఈసారి అలాంటి సమస్యలు లేకుండా శోభాయాత్రను అనుకున్న సమయానికి పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం' అని సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు.

# హర్మూజ్‌ను దాటిన భారత నౌకలు జగ్ వసంత్, పైన్ గ్యాస్



న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్‌కు చెందిన రెండు నౌకలు హర్మూజ్ జలసంధిని దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయి. పెర్షియన్ గల్ఫ్ నుంచి భారత నౌకలు జగ్ వసంత్, పైన్ గ్యాస్ అనే రెండు ఎల్పీజీ నౌకలు సోమవారం ఉదయం హర్మూజ్‌ను దాటాయి. త్వరలోనే ఈ నౌకలు దేశీయ పోర్టులకు చేరనున్నట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దేశీయంగా గ్యాస్ కొరత నేపథ్యంలో ఈ నౌకల రాకతో గ్యాస్ లభ్యత పెరిగే అవకాశమున్నట్టు చెబుతున్నారు.ఫిబ్రవరి 29న ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త దాడుల అనంతరం హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో నౌకల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. వందలాది నౌకలు ఇరాన్–ఒమన్ మధ్యన నిలిచిపోయాయి. భారతదేశం దౌత్య చర్యలతో శివాలిక్, నందాదేవి నౌకలు సురక్షితంగా గత వారం గుజరాత్‌కు చేరుకున్నాయి. ఇంధన భద్రత, గల్ఫ్‌లో భారతీయుల సేఫ్టీకి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుత సంక్షోభం ప్రభావం పడిన ఎక్స్‌పోర్టర్లకు రూ.497 కోట్ల రిలీఫ్ ప్యాకేజీని కూడా కేంద్రం ప్రకటించింది.'ఇది మనకే కాదు, యావత్ ప్రపంచానికి పరీక్షా సమయం. మన నాయకులు ఎప్పటికప్పుడు సంబంధిత దేశాల నాయకులతో సంప్రదింపులు సాగిస్తున్నారు. కువైట్ వంటి దేశాలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీనియర్ నేతలు ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారు' అని విదేశాంగ శాఖ కార్యదర్శి రణ్‌ధీర్ జైశ్వాల్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం సోమవారంనాడు లోక్‌సభలో మధ్యప్రాచ్యంలో యుద్ధం గురించి ప్రస్తావిస్తూ, పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నప్పటికీ పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టామని, పశ్చిమాసియాలోని కోటి మంది భారతీయుల రక్షణకు చర్యలు తీసుకున్నామని చెప్పారు.

# సూడాన్ ఆస్పత్రిపై డ్రోన్ దాడి.. ఈద్ వేళ 64 మంది మృతి




**న్యూఢిల్లీ,మార్చి,23:**ఆధిపత్య పోరులో భాగంగా ఓ వర్గం ఆస్పత్రిపై దాడి చేయడంతో 64 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ షాకింగ్ సంఘటన సూడాన్ చోటు చేసుకుంది. అనేక సంవత్సరాలుగా ఆధిపత్య పోరుతో అట్టుడుకుతున్న ఈ ప్రాంతంలో నిత్యం ఇలాంటి దారుణ సంఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. తాజాగా ఈద్-అల్-ఫితర్ పండుగ వేళ తూర్పు డార్ఫర్ రాష్ట్ర రాజధాని 'ఎడ్ డేన్' (జుం ఖువఅఅ) లోని టీచింగ్ ఆస్పత్రిలో జరిగిన డ్రోన్ దాడి చేశారు. ఈ దాడిలో 64 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 13 మంది చిన్నారులు, ఒక డాక్టర్, ఇద్దరు నర్సులు కూడా మరణించినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ చీఫ్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ ధృవీకరించారు. దాదాపు 89 మంది తీవ్రంగా గాయపడ్డారని, ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డు, ప్రసూతి విభాగం పూర్తిగా ధ్వంసమై ఆసుపత్రి సేవలు నిలిచిపోయాయని ఆయన వెల్లడించారు. కాగా ఆస్పత్రిపై జరిగిన ఈ దాడిపై పరస్పర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పారామిలిటరీ దళం రాపిడ్ సపోర్ట్ ఫోర్స్ ఆధీనంలో ఉన్న ఈ ప్రాంతంలో సూడాన్ ఆర్మీనే ఈ దాడికి పాల్పడిందని ఞాఖీ ఆరోపిస్తోంది. అయితే, సైన్యం ఈ ఆరోపణలను తిరస్కరించింది. తాము కేవలం సమీపంలోని పోలీస్ స్టేషన్‌ను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నామని, ఆస్పత్రిపై దాడి చేయలేదని ఆర్మీ వర్గాలు పేర్కొన్నాయి. 2023 ఏప్రిల్ నుండి జరుగుతున్న ఈ అంతర్యుద్ధంలో ఇప్పటివరకు ఆరోగ్య కేంద్రాలపై జరిగిన 213 దాడుల్లో మొత్తం 2,000 మందికి పైగా మరణించినట్లు ఔనూ గణాంకాలు చెబుతున్నాయి.

# మొయినాబాద్ డ్రగ్స్ కేసు నిందితులకు పోలీస్ కస్టడీ



హైదరాబాద్: మొయినాబాద్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టైన నిందితులను పోలీస్ కస్టడీకి ఇవ్వడానికి కోర్టు అనుమతి ఇచ్చింది. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో నిందితులుగా ఉన్న పైలట్ రోహిత్‌రెడ్డి, రితేష్‌రెడ్డి, నమిత్ శర్మలను మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి ఇవ్వాలని ఉప్పర్‌పల్లి కోర్టు ఆదేశించింది. విచారణలో భాగంగా మరిన్ని వివరాలు రాబట్టేందుకు పోలీసులకోర్టు అనుమతితో నిందితులను రేపటి నుంచి కస్టడీకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టనున్నారు. ఈ కేసులో డ్రగ్స్ నెట్‌వర్క్‌కు సంబంధించిన కీలక విషయాలను వెలికితీయాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా, కస్టడీ విచారణలో మరిన్ని కీలక వివరాలు బయటపడే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు.

# ఆలయంలో రెచ్చిపోయిన పూజారులు.. భక్తులను ఈడ్చుకెళ్లి పిడిగుద్దులు



ముంబై: ఒక ఆలయంలోని పూజారులు రెచ్చిపోయారు. కొందరు భక్తులను ఈడ్చుకెళ్లారు. వారిని కొట్టడంతోపాటు పిడిగుద్దులు కురిపించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈ సంఘటన జరిగింది. స్థానిక జ్యోతిబా ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాగా, సాంప్రదాయ ప్రదక్షిణ, హారతి సమయంలో కొందరు భక్తులు దురుసుగా ప్రవర్తించినట్లు ట్రస్ట్ ఆరోపించింది. హారతి కార్యక్రమానికి వారు అంతరాయం కలిగించినట్లు తెలిపింది. పదేపదే హెచ్చరించినప్పటికీ వారు వినిపించుకోలేదని, పూజారులపై గులాల్ విసిరారని ట్రస్ట్ ఆరోపించింది. ఈ గందరగోళంలో సాంప్రదాయ తలపాగాలు కిందపడిపోవడంతో పూజారులు ఆగ్రహించినట్లు వెల్లడించింది. మరోవైపు పరిస్థితి అదుపు తప్పడంతో సుమారు 20 మంది పూజారులు నిందితులైన భక్తులను ఆలయ ప్రాంగణంలోకి ఈడ్చుకెళ్లి కొట్టారు.

# సంపాదకీయం

## 9 దేశాలు ఖతం..!

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జెన్ జెడ్ ట్రెండ్ మార్మోగుతోంది. 1995 నుంచి 2012 మధ్య జన్మించిన పిల్లలనే జనరేషన్ జెడ్ అని పిలుస్తుంటారు. ప్రస్తుతం ఎక్కడ చూసిన డిజిటల్ విప్లవం, అధునాతన స్మార్ట్ ఫోన్ లు, ఇంటర్నెట్, ఏఐ యుగంలో వీళ్లు జన్మించారు. ఈ తరంలో జన్మించినవారు అంతకుముందు తరాలవారి వ్యవహారశైలికి భిన్నంగా ఉంటున్నారు. తమపై ప్రభుత్వాలు ఆంక్షలు విధించడాన్ని జెన్ జెడ్ అసలు అంగీకరించడం లేదుబల్గేరియాలో నెలకొన్న రాజకీయ సంక్షోభం తీవ్ర స్థాయికి చేరుకుంది. ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో పెరిగిన అవినీతి ఆరోపణలు, దేశవ్యాప్త నిరసనల కారణంగా ప్రధాని రాసెన్ జెలియాజ్‌కోవ్ నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వం రాజీనామా చేసింది. జెన్–జీ దెబ్బకు మరో ప్రభుత్వం కూలిపోయింది. బల్గేరియా ప్రభుత్వం 2026 ముసాయిదా బడ్జెట్‌ను రూపొందించింది. ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి ఈ బడ్జెట్‌ని రూపొందించారని యువత రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేశారు. దీంతో ప్రభుత్వం వెంటనే ముసాయిదా బడ్జెట్‌ను ఉపసంహరించుకున్నప్పటికీ.. యువత ఆందోళనలు విరమిచలేదు. ప్రధాని రాసెన్ జెలియాజ్‌కోవ్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాకముందే.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానం చేపట్టాలని నిర్ణయించింది. అవిశ్వాస తీర్మానం పార్లమెంట్‌లో ఓటింగ్‌కు రాకముందే.. తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు బల్గేరియా ప్రధాని ప్రకటించారు.ప్రతిపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై పార్లమెంట్‌లో ఓటింగ్ జరగడానికి ముందే.. నిరసనకారుల గళాన్ని గౌరవిస్తూ రాజీనామా చేస్తున్నట్లు ప్రధాని ప్రకటించారు. ముఖ్యంగా జనవరి 1న బల్గేరియా యూరోజోన్‌లో చేరేందుకు కేవలం 20 రోజులు మాత్రమే ఉన్న కీలక తరుణంలో ఈ నిర్ణయం తీసుకోవడం దేశ రాజకీయాల్లో అనూహ్య మలుపుగా మారింది. బల్గేరియాలో జెన్ జెడ్ సాగించిన అవినీతి వ్యతిరేక ఆందోళనల ధాటికి ప్రధాని రాసెన్ జెలియాజ్‌కోవ్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం పతనమైంది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కూడా పూర్తి కాకముందే.. తమ ప్రభుత్వం రాజీనామా చేస్తున్నట్లు ప్రధాని గురువారం ప్రకటించారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షం ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరగడానికి కొద్దిసేపటి ముందే ఆయన ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు.బల్గేరియాలో అవినీతికి వ్యతిరేకంగా వేలాది మంది యువజనులు బుధవారం దేశవ్యాప్తంగా భారీ ఆందోళనలు నిర్వహించారు. ఈ నిరసనలకు ప్రధాన కారణం ప్రభుత్వం రూపొందించిన 2026 ముసాయిదా బడ్జెట్. ఈ బడ్జెట్ అవినీతిని కప్పిపుచ్చేందుకు రూపొందించిందని యువతరం తీవ్రంగా మండిపడింది. ఈ ముసాయిదాపై ఆగ్రహించిన నిరసనకారులు రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం గత వారం ఈ ముసాయిదా బడ్జెట్‌ను ఉపసంహరించుకున్నప్పటికీ.. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు ఏ మాత్రం చల్లారలేదు. యువతరం అవినీతి, పాలన లోపాలపై నిరసన కొనసాగించడంతో.. జెలియాజ్‌కోవ్ ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి తీవ్రమైందిప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపక్షం ప్రవేశ పెట్టడం, దేశవ్యాప్త నిరసనలతో ప్రజాగ్రహం పెరగడంతో ప్రధాని రాసెన్ జెలియాజ్‌కోవ్.. అధికార పార్టీ నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశం అనంతరం ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం రాజీనామా చేయడమే సరైన నిర్ణయమని ప్రకటిస్తూ.. గురువారం తన రాజీనామాను సమర్పించారు. ఈ పరిణామం బల్గేరియా రాజకీయాల్లో అస్థిరతకు దారి తీసింది. పూర్తిస్థాయి ప్రజాదరణ ఉన్న ప్రభుత్వం ఏడాది కూడా పూర్తి చేయకుండానే కూలిపోవడంతో.. దేశంలో ఆకస్మిక ఎన్నికలు అనివార్యం కానున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.2020లో బొయికో బోరిస్సోవ్ ప్రభుత్వాన్ని అవినీతి వ్యతిరేక నిరసనలు కూల్చినప్పటి నుంచి దేశంలో ఏడు ఎన్నికలు జరిగాయి. ఈసారి రాజీనామా చేయకముందు కూడా జెలియాజ్‌కోవ్ ప్రభుత్వం ఐదు అవిశ్వాస తీర్మానాలను ఎదుర్కొని గట్టెక్కింది. రాజీనామా తర్వాత కూడా మంత్రులు కొత్త మంత్రివర్గం ఎన్నికయ్యే వరకు తమ పాత్రలను కొనసాగిస్తారని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది.జెన్ జెడ్ ఆందోళనలు బంగ్లాదేశ్ లోనూ చెలరేగాయి. అక్కడ కూడా ప్రభుత్వం కుప్పకూలింది. తాజాగా యువత చేతిలో నేపాల్ బలైంది. ఇప్పుడు పెరూ దేశం కూడా జెన్ జెడ్ ఆందోళనల ధాటికి అట్టుడుకిపోతుంది. ఈ సంవత్సరంలో మొత్తం 8 దేశాల్లో జెన్ జెడ్ ఆందోళనలు చేపట్టింది. ఇండోనేషియాలో మొదలుపెట్టి ఇప్పుడు పెరూ వరకు వచ్చింది. పెరూ రాజధాని లిమాలో వేలాదిమంది యువత రోడ్లపైకి వచ్చి ఆ దేశ అధ్యక్షుడు దినా బోలువార్టే కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ క్రమంలో పోలీసులు, నిరసనకారుల మధ్య ఉద్రిక్తమైన పరిస్థితులు నెలకున్నాయి. పోలీసులు టియర్ గ్యాస్ ను ప్రయోగించారు. లాఠీఛార్జ్ చేశారు. అయితే పోలీసులపై నిరసనకారులు రాళ్లు రువ్వారు. పెన్షన్ సిస్టమ్‌లో పలు మార్పులు చేసినందుకు ఈ ఆందోళనలు ప్రారంభమైనట్లు తెలుస్తోంది.

## ఆర్.జి.1 ఏరియాలో ఆడిట్ డిపార్ట్ మెంట్ లో ఆన్యువల్ ఇంక్రిమెంట్స్



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) రామగుండం రీజియన్ లోని ఆర్జీ.1,2,3 మరియు భూపాల పల్లి ఏరియాల ఉద్యోగుల సుమారు 15,300 మంది ఎన్.సి.డబ్ల్యు.ఏ ఉద్యోగుల యొక్క 2025-26 సంవత్సరం కు సంబందించిన మార్చి 2026 ఆన్యువల్ ఇంక్రిమెంట్స్ చేయటం జరుగుతుందని. ఇట్టి ఆన్యువల్ ఇంక్రిమెంట్ ను ఆర్.జి రీజియన్ ఇంటర్నల్ ఆడిట్ ఫైనాన్స్ మేనేజర్ శ్రీ మోహన్ రావు గారి పర్యవేక్షణలో నిర్వహించటం జరుగుతుంది. ఇట్టి ఆన్యువల్ ఇంక్రిమెంట్స్ లను త్వరిత గతిన కచ్చితత్వంతో టీం వర్క్ గా చేయటం జరిగుతుంది. ఇట్టి ఆన్యువల్ ఇంక్రిమెంట్ కోసం ఆడిట్ అధికారులు మరియు సుమారు 20 మంది క్లరికల్ సిబ్బంది పాల్గొనటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ మేనేజర్ శ్రావణ్ కుమార్, సీనియర్ అకౌంట్స్ అధికారి మణిదీప్ మరియు ఆడిట్ డిపార్ట్ మెంట్ క్లరికల్ స్టాఫ్ పాల్గొన్నారు.

## ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల నల్ల రిబ్బన్లతో హాస్పిటల్ ముందు నిరసన

### 6 నెలలుగా పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని డాక్టర్ రవి.డిమాండ్



(తెలంగాణ అవతరణ ప్రతినిధి ఆసిఫాబాద్ జిల్లా 23) నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటియుసి ట్రేడ్ యూనియన్ పిలుపు మేరకు సిరిలిక్ కాలనీ కాగజ్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు సోమవారం రోజున మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు. ఆరు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని డాక్టర్.రవి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పబ్లిక్ హెల్త్ మేనేజర్ సదాలక్ష్మి మాట్లాడుతూ... ఎన్ హెచ్ ఎం ఉద్యోగులందరికీ సుప్రీంకోర్టు గైడ్లైన్స్ ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ప్రతి నెల 5వ తేదీలోపు ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలని, వేతనాలు ఈ నెల అనగా 28 మార్చి 2026 తేదీలోపు వేతనాలు ప్రభుత్వం చెల్లించాలని, ప్రభుత్వం ఒకవేళ చెల్లించకపోతే 29 మార్చి 2026 హైదరాబాద్ ఇందిరా పార్కులో మహాధర్న కు వెళ్తామని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం నర్సింగ్ ఆఫీసర్ ఎం.రత్నమాల, ఫార్మసి ఆఫీసర్ ఎస్.దివ్య, డాటా ఎంట్రీ ఆపరేటర్ మనీషా, ల్యాబ్ టెక్నీషియన్ ప్రియాంక, ఎం.ఓ అసిస్టెంట్, గోపికృష్ణ , సపోర్టింగ్ స్టాఫ్ రాధమ్మ మరియు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సంస్థ బకాయిలను వెంటనే చెల్లించాలి

### - కొత్త గనులు ప్రారంభించాలి- ఖని లో సేవ్ సింగరేణి పోరు జాత కార్నర్ మీటింగ్ లో ఏఐటియుసి నాయకులు



తెలంగాణ అవతరణ, గోదావరిఖని, మార్చ్ 23:సింగరేణి సంస్థ కు రావాల్సిన 51 వేల కోట్ల రూపాయల బకాయిలను వెంటనే చెల్లించాలని, కొత్త గనులు ప్రారంభించాలని ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్ రాజ్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం గోదావరిఖని చౌరస్తా లో జరిగిన సేవ్ సింగరేణి పోరు జాత కార్నర్ మీటింగ్ లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. సింగరేణి లో కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించడం లో యాజమాన్యం వైఫల్యం చెందిందని వారు ఆరోపించారు. ముఖ్యంగా సింగరేణి లో రాజకీయ జోక్యం వల్ల కొత్త గనులు రావడం లేదని, ఉన్న గనులు మూసివేత కు దగ్గరలో ఉన్నాయని, వెంటనే కొత్త గనులను ప్రారంభించాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కి చెల్లించాల్సిన 51 వేల కోట్ల రూపాయల బకాయిలను చెల్లించకుండా సంస్థ ను నిర్వీర్యం చేస్తుందని వారు ఆరోపించారు, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కి రావాల్సిన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఏసిబి విచారణ పేరుతో నిలిపి వేసిన మెడికల్ బోర్డు ను వెంటనే నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా సింగరేణి లో మారుపేర్లు, విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంటు లకు ఉద్యోగాలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లే ఇవ్వడం లేదని వారు ఆరోపించారు, వెంటనే వారికి ఉద్యోగాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం ఏఐటియుసి తో జరిపిన స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో ఒప్పుకున్న డిమాండ్ లను అమలు చేయకుండా యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తుందని వారు ఆరోపించారు, వెంటనే ఒప్పుకున్న డిమాండ్ లను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల కు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని తదితర డిమాండ్ లపై సింగరేణి వ్యాప్తంగా మార్చి 30 వరకు ఏఐటియుసి సేవ్ సింగరేణి పోరు జాత ను నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. యాజమాన్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని లేకుంటే ఎప్రిల్ లో సమ్మెకు పిలుపు నిస్తామని వారు హెచ్చరించారు. ఇట్టి సమావేశానికి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ అధ్యక్షత వహించగా నాయకులు వీరభద్రం, వై.వి.రావు, ముస్కె సమ్మయ్య, కవ్వంపల్లి స్వామి, బాజీసైదా, కనకరాజు, సూర్య, సంకె అశోక్, మాదన మహేష్, రంగు శ్రీను, ఎం.ఎ.గౌస్, విజయలక్ష్మి, ఓదెమ్మ తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు గోదావరిఖని భాస్కర్ రావు భవన్ నుంచి ప్రధాన రోడ్డు మీదుగా చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రజానాట్యమండలి కళాకారులు కన్నం లక్ష్మి నారాయణ, లెనిన్, మోహన్, జాలిగం రాజు, రాంచందర్, చంద్ర మోహన్ లు విప్లవ గేయాలు ఆలపించారు.

## సింగరేణి మెయిన్ హాస్పిటల్ సీఎమ్ఓ డా. కిరణ్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) సింగరేణి ఏరియా హాస్పిటల్ రామగుండం నందు ఏర్పాటు చేస్తున్న క్యాత్ ల్యాబ్ కి సంబందించిన సింగరేణి మెయిన్ హాస్పిటల్ CMO డా. కిరణ్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో రెనే హాస్పిటల్ వారు హాస్పిటల్ వెండర్స్ మధ్య సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. క్యాత్ ల్యాబ్ అతి త్వరలో ప్రారంభిచాలని ఇంకా ఏమైనా పనులు ఉంటే పూర్తి చేయాలని డా. కిరణ్ రాజ్ కుమార్ జమీా కోరారు.ఈ కార్యక్రమం లో డాక్టర్లు బాలకోటయ్య, డా. అంబికా, డా. రాజేశ్వర్ రావు, డా. రమేష్, రెనే హాస్పిటల్ చైర్మన్ డా. బంగారి స్వామి,రెనే హాస్పిటల్ డాక్టర్లు పాల్గొన్నారు.

## ఇరాన్ సంక్షోభం ఎఫెక్ట్.. గ్యాస్ సిలిండర్‌లో ఇక 10 కిలోలేనా?



**హైదరాబాద్,మార్చి,23:**ఇరాన్‌లో కొనసాగుతున్న సంక్షోభం ప్రభావం భారతీయుల వంటగదిపై పడనుంది. గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఎల్‌పీజీ దిగుమతులు భారీగా తగ్గిపోయాయి. దీంతో దేశంలో గ్యాస్ నిల్వలు అడుగంటుతున్నాయి. ఈ తీవ్ర కొరతను అధిగమించేందుకు ప్రభుత్వ రంగ చమురు సంస్థలు కీలక ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సరఫరా చేస్తున్న 14.2 కిలోల సిలిండర్లలో ఇకపై 10 కిలోల గ్యాస్‌ను మాత్రమే నింపి వినియోగదారులకు అందించే అవకాశాన్ని అన్వేషిస్తున్నాయి. ది ఎకనామిక్ టైమ్స్ ప్రచురించిన కథనం ప్రకారం ఈ నిర్ణయంతో పరిమితంగా ఉన్న గ్యాస్ నిల్వలను ఎక్కువ కుటుంబాలకు పంపిణీ చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. సాధారణంగా 14.2 కిలోల సిలిండర్ ఒక సగటు కుటుంబానికి 35 నుంచి 40 రోజుల వరకు వస్తుంది. అదే 10 కిలోల గ్యాస్ అయితే దాదాపు నెల రోజులు సరిపోతుంది. దీనివల్ల ప్రస్తుత నిల్వలతోనే ఎక్కువ ఇళ్లకు సరఫరా కొనసాగించవచ్చన్నది ప్రభుత్వ ఆలోచన. అయితే, ఈ మార్పు అంత సులభం కాదు. బాట్లింగ్ ప్లాంట్లలోని యంత్రాలను కొత్త బరువుకు అనుగుణంగా మార్చాల్సి ఉంటుంది. కొన్ని నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు కూడా అవసరం. దీనికి తోడు సిలిండర్ బరువును తగ్గిస్తే ప్రజల్లో గందరగోళం, నిరసనలు వ్యక్తమయ్యే ప్రమాదం ఉందని, త్వరలో జరగనున్న రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో ఇది రాజకీయంగా ఇబ్బందులు సృష్టించవచ్చని అధికారులు ఆందోళన చెందుతున్నారు. కానీ, రాబోయే రోజుల్లో సరఫరా పరిస్థితి మరింత దిగజారితే గ్యాస్‌ను ఆదా చేయడానికి ఇది తప్ప మరో మార్గం ఉండకపోవచ్చని నివేదిక పేర్కొంది. మరోవైపు వాణిజ్య వినియోగదారులకు పాక్షికంగా సరఫరా పునరుద్ధరించడంతో నిల్వలపై మరింత భారం పడింది. ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ప్రజలు గ్యాస్‌ను పొదుపుగా వాడుకోవాలని పెట్రోలియం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ సూచించారు. భారత్ తన ఎల్‌పీజీ అవసరాల్లో 60 శాతం దిగుమతులపై ఆధారపడగా, సంక్షోభానికి ముందు గల్ఫ్ దేశాల నుంచే 90 శాతం సరఫరా జరిగేది. ప్రపంచ చమురు, గ్యాస్ రవాణాలో 20 శాతం వాటా ఉన్న హర్మూజ్ జలసంధిని ఇరాన్ తన శత్రు దేశాల నౌకలకు మాత్రమే మూసివేస్తున్నట్లు ప్రకటించింది.




# 'పెద్ది' మేనియా.. భారీ ఆఫర్లతో బయ్యర్ల క్యూ!

అందుతున్న సమాచారం ప్రకారం... 'పెద్ది' థియేట్రికల్ బిజినెస్ సుమారు రూ.300 కోట్ల మార్కును తాకే అవకాశం ఉందని తెలుస్తోం ది. ముఖ్యంగా నైజాం ఏరియాలో రూ. 65 కోట్ల వరకు బిజినెస్ జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో భాగస్వామిగా ఉన్న మైత్రీ మూవీ మేకర్స్‌తో పాటు, అగ్ర నిర్మాతలు దిల్ రాజు, ఏషియన్ సునీల్ హక్కుల కోసం తీవ్రంగా ప్రయత్ని స్తున్నట్లు సమాచారం. ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ క్రేజ్ స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే కర్ణాటక హక్కులు 23 కోట్లు, ఓవర్సీస్ హక్కులు 40 కోట్లు చొప్పున అగ్రిమెంట్లు పూర్తయినట్లు తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోని ఇతర ప్రాంతాల్లో కూడా 'పెద్ది' బిజినెస్ లెక్కలు హాట్ టాపిక్‌గా మారాయి. సీడెడ్ ప్రాంతంలో 35 కోట్లు, కోస్టల్ ఆంధ్రలో సుమారు 85 కోట్ల వరకు ఈ చిత్రం బిజినెస్ చేసే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ గణాంకాలు చూస్తుంటే రామ్ చరణ్ మాస్ పవర్ బాక్సాఫీస్ వద్ద ఏ రేంజ్‌లో ఉండబోతోందో అర్థమవుతోంది. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా, సౌత్ ఇండియా మొత్తం ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. దీనికి తోడు మెగా ఫ్యాన్స్ సోషల్ మీడియాలో చేస్తున్న హడావిడి సినిమా హైప్‌ను మరింత పెంచు తోంది. నార్త్ ఇండియాలో ఇంకా అధికారికంగా డీల్స్ ప్రారంభం కాకపోయినప్పటికీ, హిందీ ట్రేడ్ సర్కిల్స్‌లో 'పెద్ది' పేరు మారు మోగిపోతోంది. ఈ చిత్రం 'పుష్ప' రేంజ్‌లో మ్యాజిక్ చేస్తుందని అక్కడి బయ్యర్లు బలంగా నమ్ముతున్నారు.

ఆ నమ్మకంతోనే భారీ ధరలకు హక్కులను దక్కించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇక థియేట్రికల్ ఆదాయమే కాకుండా డిజిటల్, ఓటిటి, శాటిలైట్, ఆడియో హక్కుల ద్వారా వచ్చే ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుంటే, నిర్మాత ఇప్పటికే టేబుల్ ప్రాఫిట్‌లో ఉ న్నారని అందరికీ స్పష్టమవుతోంది. ఈ నెలలో రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా దర్శకుడు బుచ్చిబాబు ఒక పవర్‌ఫుల్



ట్రైలర్‌ను విడుదల చేసే ప్లాన్‌లో ఉన్నారు. ఈ ట్రైలర్ గనుక ప్రేక్షకులను మెప్పిస్తే, ఇప్పుడు జరుగుతున్న బిజినెస్ చర్చలకు మరింత బలం చేకూరుతుంది. ప్రస్తుతం ఐటెం సాంగ్ చిత్రీకరణతో పాటు కొన్ని ప్యాచ్ వర్క్ పనులు మిగిలి ఉన్నప్పటికీ, విడుదల తేదీలో ఎలాంటి మార్పు ఉండదని చిత్ర యూనిట్ స్పష్టం చేస్తోంది. ఏప్రిల్ 30న 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయ డం ఖాయమని, ఇది ట్రేడ్ పరంగా సరికొత్త చరిత్ర సృష్టిస్తుందని పరిశ్రమ వర్గాలు బలంగా విశ్వసిస్తున్నాయి.

# మార్చి 27న రానున్న ప్రియదర్శి 'సుయోధన'




తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తనదైన నటనతో అలరిస్తున్న యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'సుయోధన'. ఈ సినిమాకు సంబంధించి తాజాగా మేకర్స్ ఒక ఆసక్తికరమైన అప్‌డేట్‌ను ప్రకటించారు. ఈ చిత్రాన్ని మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా చిత్ర బృందం విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ ప్రస్తుతం సినీ సర్కిల్స్‌లో వైరల్ అవుతోంది.ప్రజ్వల లైన్ క్రియేషన్స్ బ్యానర్‌పై బోసుబాబు నిడుమోలు నిర్మిస్తున్న ఈ చిత్రానికి, వై.ఎస్. మాధవ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో ప్రియదర్శి సరసన ద్రిషిక చందర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా 'డైలాగ్ కింగ్' సాయికుమార్ మరియు సీనియర్ నటి ప్రేమ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ఈ సందర్భం గా నిర్మాత బోసుబాబు నిడుమోలు మాట్లాడుతూ, "ఒక మంచి కథ, కథనాలతో అత్యుత్తమ నిర్మాణ విలువలతో 'సుయోధన' చిత్రాన్ని రూపొందించాము. ప్రియదర్శి, సాయికుమార్ నటన సినిమాకు ప్రాణంపోశాయి. సంగీత దర్శకుడుజై క్రిష్‌అందించిన స్వరాలు, రామ జోగయ్య శాస్త్రి గారి సాహిత్యం ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని మార్చి 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమయ్యాము.


# వృషకర్మ కోసం నాగచైతన్య కసరత్తులు




యువ హీరో నాగ చైతన్య ప్రస్తుతం హీరోగా తెరకెక్కుతున్న ఇంట్రెస్టింగ్ థ్రిల్లర్ చిత్రం వృషకర్మపై ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా మీనాక్షి చౌదరి నటిస్తుం డగా, టాలెంటెడ్ దర్శకుడుకార్తీక్ వర్మ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'వృష కర్మ' గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో కూడిన ఈ సినిమా థియేటర్లలో సాలిడ్ ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తుందని మేకర్స్ హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఈ సినిమాలో నాగ చైతన్య పూర్తిగా కొత్త లుక్‌లో కనిపిం చబోతుండటం అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోం ది. తాజాగా నాగ చైతన్య సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. ఆయన జిమ్‌లో తీసుకున్న ఒక ఫోటోను పోస్ట్ చేశాడు. ఆ ఫోటోలో చైతు 6 ప్యాక్ బాడీతో స్టైలిష్‌గా కనిపించడం అభిమానులను ఆశ్చర్యపరిచింది. నాగ చైతన్య డీ-గ్లామరస్ లుక్‌లో కనిపించిన సంగతి తెలిసిందే. అయితే 'వృష కర్మ' కోసం మాత్రం పూర్తిగా స్టైలిష్ మరియు ఫిట్ లుక్‌లోకి మారడం విశేషంగా మారింది. నాగ చైతన్య ఈ ఫోటోలను షేర్ చేసిన కొద్ది నిమిషాల్లోనే సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యాయి. హీరో సుశాంత్ వంటి సెలబ్రిటీలు కూడా ఈ పోస్ట్‌పై స్పందించగా, వేలాది మంది అభిమానులు ర్ ఎమోజీలు, లైక్స్‌తో కామెంట్స్ సెక్షన్‌ను హోరెత్తించారు. ఇదిలా ఉండగా నాగ చైతన్య సెట్స్‌కి సంబంధించిన మరికొన్ని ఫోటోలు కూడా షేర్ చేశారు. షూటింగ్ లొకేషన్స్‌లో తీసిన ఈ చిత్రాలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో 'వృష కర్మ' సినిమాపై అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది.




# ప్రభాస్ స్పిరిట్ కోసం అభిమానుల ఎదురుచూపు




రాజాసాబ్ డిజాస్టర్‌తో ఇప్పుడు ప్రభాస్ అభిమానులు ఆయన తదుపరి సినిమా స్పిరిట్ కోసం తెగ ఎదురుచూస్తున్నారు. ప్రభాస్ నటిస్తున్న భారీ ప్రాజెక్ట్‌లలో ప్రేక్షకులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూ స్తున్న సినిమా స్పిరిట్ అభిమానుల అంచనాలకు తగ్గట్లుగా రూపొందించడంలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్రయత్నిస్తున్నా రు. ఈ చిత్రం ఒక పవర్‌ఫుల్ కాప్ యాక్షన్ డ్రామాగా రూపొందుతో ంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ ప్రకటించినప్పటి నుంచే సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ నటి తృప్తి డిమ్రి నటిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. ప్రస్తుత షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరణ జరుగుతుండగా, అది పూర్తయ్యిన వెంటనే ఒక గ్రాండ్ సాంగ్‌ను షూట్ చేయాలని చిత్రబృందం ఎ÷-లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ పాట సినిమాలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా ఈ సాంగ్‌లో ప్రభాస్ మాస్ స్టెప్స్‌తో పాటు తృప్తి డిమ్రి గ్లామర్ కూడా హైలైట్‌గా ఉండనుందని చెబుతున్నారు. భారీ సెట్స్, గ్రాండ్ విజువల్స్‌తో ఈ పాటను తెరకెక్కించేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక 'స్పిరిట్' సినిమా మొత్తంగా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. ఇందులో ప్రభాస్ ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. ముఖ్యంగా ప్రభాస్ లుక్ పూర్తిగా వైల్డ్ అండ్ మాస్ అవతార్‌లో ఉండటంతో అభిమానుల్లో ఈ సినిమాపై హైప్ మరింత పెరిగింది. కథలోని ఎమోషన్, యాక్షన్‌కు తగ్గట్టుగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా ప్రత్యేకంగా ఉండబోతుందని సమాచారం. భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను టి-సిరీస్‌తో పాటు భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సాంకేతికంగా కూడా ఈ సినిమా అత్యున్నత ప్రమాణాలతో రూపొందించేందుకు మేకర్స్ ప్రత్యేకంగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక కథ విషయానికి వస్తే, 'స్పిరిట్' మెయిన్ కాన్సెప్ట్ పూర్తిగా కొత్తగా ఉండబోతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తన స్టైల్‌కు తగ్గట్టుగా రియలిస్టిక్ యాక్షన్‌తో పాటు గట్టి ఎమోషనల్ ఎలిమెంట్స్ కూడా ఈ సినిమాలో చూపించనున్నారని టాక్ వినిపిస్తోంది.

# కీరవాణి కొడుకుతో బలగం హీరోయిన్ ప్రేమ..!



తెలుగు సినీ పరిశ్రమలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న కావ్య కళ్యాణ్ రామ్ ఆ తర్వాత హీరోయిన్‌గా మారి తనకంటూ ప్రత్యేకస్థానం సంపాదించుకుంది. చిన్నప్పుడే పలు సినిమాల్లో నటిం చి ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె, పెద్దయ్యాక హీరోయిన్‌గా కూడా వరుస అవకాశాలు అందుకుంటోంది. హీరోయిన్‌గా ఆమె చేసిన మసూద,బలగం, ఉస్తాద్ వంటి సినిమాలు మంచి గుర్తింపు తెచ్చి పెట్టాయి. ముఖ్యంగా 'బలగం' సినిమా భారీ విజయాన్ని సాధించ డంతో కావ్యకు మరింత క్రేజ్ వచ్చింది. ప్రస్తుతం కూడా ఆమె పలు కొత్త ప్రాజెక్టులతో బిజీగా ఉంది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలో కూడా కావ్య చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తరచూ తన ఫోటోలు, వీడియోలు పంచుకుంటూ అభిమానులతో టచ్‌లో ఉంటోంది. ఆమె పోస్ట్ చేసే ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి. ఇదిలా ఉంటే ప్రస్తుతం కావ్య కళ్యాణ్ రామ్ పెళ్లి గురించి టాలీవుడ్‌లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి పెద్ద కుమారుడు, గాయకుడు ,సంగీత దర్శకుడు కాళ భైరవతో కావ్య ప్రేమలో ఉ న్నారని వార్తలు వినిపిస్తున్నాయి. కాల భైరవ మొదట గాయకుడిగా తన కెరీర్‌ను ప్రారంభించి మంచి గుర్తింపు సంపాదించాడు. తర్వాత సంగీత దర్శకుడిగా కూడా తన ప్రతిభను చూపిస్తూ వరుసగా సినిమాలకు సంగీతం అందిస్తున్నాడు. తన ప్రత్యేక శైలితో ప్రేక్షకు లను ఆకట్టుకుంటూ టాలీవుడ్‌లో మంచి స్థానం సంపాదించుకుం టున్నాడు. ఇక గత కొన్నేళ్లుగా కాల భైరవ మరియు కావ్య కళ్యాణ్ రామ్ మధ్య స్నేహం ప్రేమగా మారిందని టాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. వీరిద్దరూ చాలా కాలంగా డేటింగ్ చేస్తున్నారని, ఇప్పటికే ఇరు కుటుంబాలు కూడా వారి ప్రేమను అంగీకరించాయని వార్తలు వస్తున్నాయి. ఇక ఈ ఏడాదిలోనే వీరి పెళ్లి జరిగే అవకాశం ఉందనికూడా సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కీరవాణి కుటుంబంలో మరో పెళ్లికూడా జరిగింది. ఆయన చిన్న కుమారుడు సింహా కోడూరి ప్రముఖ నటుడు మురళి మోహన్ మనవరాలిని వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే.

## స్పీడ్‌గా ఎన్టీఆర్ డ్రాగన్ షూటింగ్

ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్'. ఇటీవల జోర్డాన్‌లో కీలకమైన షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న చిత్ర యూనిట్, ఇప్పుడు తదుపరి యాక్షన్ వేట కోసం సిద్ధమైంది. జోర్డాన్ షెడ్యూల్‌లో హై-వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించాడు ప్రశాంత్ నీల్. ఇక ఇప్పుడు నెక్స్ట్ షెడ్యూల్‌లో కూడా భారీ యాక్షన్ ఉ ండబోతుందని తెలుస్తోంది. కొత్త షెడ్యూల్ ఈ వారంలోనే హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని సమాచారం.

ఇందుకోసం నగర శివార్లలోని ఒక ప్రముఖ స్టూడియోలో మూడు భారీ సెట్లను నిర్మించారట. ఇందులో విలన్ ఇంటికి సంబంధించిన సెట్ కూడా ఉందట. దాదాపు నెల రోజులకు పైగా సాగే ఈ లాంగ్ షెడ్యూల్‌లో.. సినిమాలోని కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారట. ఇక ఇక్కడ షూటింగ్ పూర్తయిన వెంటనే, చిత్ర యూనిట్ తదుపరి షెడ్యూల్ కోసం శ్రీలంక వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అక్కడ కూడా యాక్షనే ఉంటుందని టాక్. మొత్తంగా చూసుకుంటే.. డ్రాగన్ యాక్షన్ షెడ్యూల్సే ఎక్కువగా ఉన్నాయి. ఈ లెక్కన ప్రశాంత్ నీల్ ఏ రేంజ్ యాక్షన్ డోస్ ఇవ్వబోతున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఈ సినిమాలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ అనిల్ కపూర్ మరియు మలయాళ నటుడు టోవినో థామస్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. 'కె.జి.ఎఫ్', 'సలార్' వంటి బ్లాక్ బస్టర్స్ తర్వాత ప్రశాంత్ నీల్ నుంచి వస్తున్న చిత్రం కావడంతో.. డ్రాగన్ పై అంచనాలు పీక్స్‌లో ఉన్నాయి.

Printer, Published and Owned by AMBATI PUBLICATIONS at H.No. 8-3-214, Mallikarjun Nagar, Godavarikhani, Dist. Peddapalli. Telangana State - 505 209."
Printers : Ganesh Offset Printers, Godavarikhani. Editor: P. Ramakrishna, RNI No. TELTEL/2021/02031, email : yadavpolaveni123456@gmail.com, Mobile : 7396644411